# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 25 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 30 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :25 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 30 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

- 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్
- గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి
- రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం
- అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు

- మిగతా 2లో



## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

- ఇటీవల కన్నుమూసిన వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్
- ఒంగోలులో కాకుమాను నివాసానికి వెళ్లిన జగన్
- కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా

- మిగతా 2లో

## నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

- విజయవాడలో మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల సదస్సు
- ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఏపీకి దేశంలోనే ప్రథమ స్థానం
- పాలనలో టెక్నాలజీ వాడకం పెరగాలని సీఎం చంద్రబాబు పిలుపు
- నేర్చుకున్న నైపుణ్యాలు సేవల నాణ్యతలో కనిపించాలని స్పష్టీకరణ

- మిగతా 2లో






# పల్లె పండుగ 3.0 ప్రారంభం.. గ్రామాలకు రూ.11,085 కోట్లు

- ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన
- గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో తమ రెండేళ్ల పాలనను పోల్చిన ముఖ్యమంత్రి
- వెలిగొండ ఫేజ్-2 పూర్తితో పాటు ఉదయగిరి ప్రాంతానికి పలు ప్రాజెక్టులు మంజూరు
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే ఎన్డీయే ప్రభుత్వ మంత్రమని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ-3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

### గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు

'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది,"

- మిగతా 2లో

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

అమెరికాకు జైశంకర్ గట్టి సంకేతం



- ఉగ్రవాదంపై భాగస్వాముల వైఖరి సంబంధాలను ప్రభావితం చేస్తుందన్న జైశంకర్
- తమ ప్రధాన ఆందోళనను అర్థం చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవని స్పష్టీకరణ
- దశాబ్దాలుగా పొరుగు దేశం నుంచి ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నామని వెల్లడి
- భారత్-అమెరికా బంధానికి వాణిజ్య విభేదాలతో పాటు ఉగ్రవాదం కూడా సవాల్ అని వ్యాఖ్య

- మిగతా 2లో

## ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు



- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో సింగపూర్ హోం మంత్రి షణ్ముగం భేటీ
- రాష్ట్రంలో విద్యా సంస్కరణలను ప్రశంసించిన సింగపూర్ మంత్రి
- మాదకద్రవ్యాల నియంత్రణ, విద్యారంగంలో ఏపీకి సహకారం అందిస్తామని హామీ
- ఏపీ ఐటీఐలను సింగపూర్ ఐటీఈతో అనుసంధానించాలని నిర్ణయం
- డ్రాపౌట్లను సున్నా శాతానికి తగ్గించాలని షణ్ముగం సూచన

- మిగతా 2లో



## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

పెన్ పవర్ డెస్క్: ప్రతిపక్ష ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై చెప్పింది. ఇకపై ఇండియా కూటమిలో తాము భాగం కాదని తెలిపింది. కాంగ్రెస్?తో విభేదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 30న కాంగ్రెస్ అధ్యక్షతన జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం లేదని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

- మిగతా 2లో

## నలుగురు సహోద్యోగులను కాల్చి చంపిన సీఐఎస్ఎఫ్ జవాన్




- జమ్మూకశ్మీర్‌లోని కతువా జిల్లాలో సీఐఎస్ఎఫ్ క్యాంపులో దారుణం
- సహోద్యోగులపై కాల్పులు జరిపిన హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్
- అసిస్టెంట్ కమాండెంట్ సహా నలుగురు సిబ్బంది అక్కడికక్కడే మృతి
- వాగ్వాదమే కాల్పులకు కారణమని ప్రాథమిక సమాచారం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు.. సీఐఎస్ఎఫ్ ఉన్నతస్థాయి విచారణ

- మిగతా 2లో

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను

- మిగతా 2లో

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం.. ఆరుగురు మృతి



పెన్ పవర్ డెస్క్:మాస్కో: రష్యాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. శిక్షణ సమయంలో రష్యా సైనిక విమానం (Tu-95 బాంబర్) కుప్పకూలింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా మరొకరు గాయపడ్డారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తూర్పు అమూర్

- మిగతా 2లో

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

- ఎన్నికల ప్రక్రియలో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపణ
- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు డిమాండ్
- 13.30 కోట్ల ఓట్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని తీర్మానం
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని పట్టు
- పార్లమెంటు, కోర్టులు, వీధుల్లో పోరాడతామని కాంగ్రెస్ ప్రకటన

- మిగతా 2లో






## అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి

- చివరి వ్యక్తి సంక్షేమమే అభివృద్ధికి గీటురాయి అన్న భగవత్
- అభివృద్ధిలో అంతరాలు వీలైనంత తగ్గించాలని సూచన
- ప్రకృతిని కాపాడుకుంటూనే ప్రగతి సాధించాలి
- అభివృద్ధి బాధ్యత సమాజం కూడా తీసుకోవాలని పిలుపు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

దేశాభివృద్ధిలో రాబోయే రెండు దశాబ్దాలు అత్యంత కీలకమని, ప్రజల మారుతున్న ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలనా వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన "మిషన్ కర్మయోగి" దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ప్రకటించిన పురస్కారాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి స్వీకరించారు. ఈ విభాగంలో కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి అవార్డులను అందుకున్నాయి. శిక్షణ అంటే కేవలం ధ్రువపత్రాలు పొందడం మాత్రమే కాదని, నేర్చుకున్న నైపుణ్యాలు ప్రజలకు అందే సేవల నాణ్యతలో ప్రతిబింబించాలని సీఎం పేర్కొన్నారు. "ఒక రెవెన్యూ అధికారి సమస్యను వేగంగా పరిష్కరించడం, ఉపాధ్యాయుడు మెరుగ్గా బోధించడం వంటి సానుకూల మార్పులే శిక్షణకు అసలైన గీటురాయి" అని ఆయన వివరించారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఇంకా పాత నిబంధనలు, అనవసరమైన పేపర్‌వర్క్‌ను కొనసాగించడం సరికాదని, పాలనా ప్రక్రియలను సమూలంగా సంస్కరించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియాలో సమయాన్ని వెచ్చించే బదులు, 'ఐగాట్-మిషన్ కర్మయోగి' వేదిక ద్వారా తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కేవలం నియంత్రణ వ్యవస్థగా కాకుండా, ప్రజలను సాధికారత దిశగా నడిపించేదిగా ఉండాలని, తద్వారా 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో పలు దక్షిణాది రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

- మొదటి పేజి తరువాయి

డీఎంకే ప్రతినిధి టి.కె.ఎస్. ఇలంగోవన్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఇకపై డీఎంకే భాగం కాదని తెలిపారు. కాంగ్రెస్ తో విభేదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సెప్టెంబర్ 30న జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి కూడా డీఎంకే హాజరు కాదని ఆయన తేల్చిచెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ తమతో బంధాన్ని తెంచుకుని అధికార టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చి మాకు ద్రోహం చేసిందని విమర్శించారు. కేవలం రెండు పదవుల కోసం ఆశపడి కాంగ్రెస్ డీఎంకేకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు. కాంగ్రెస్ తీరుతో ఇండియా కూటమిలోని ఇతర పార్టీలు కూడా అసంతృప్తితో ఉన్నాయని.. సమావేశానికి వెళ్లేందుకు ఆ పార్టీలు కూడా విముఖత వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. అయితే, బీజేపీపై వ్యతిరేకత విషయంలో ఇండియా కూటమిలోని పార్టీలు భావజాలపరంగా ఐక్యంగానే ఉన్నాయని చెప్పారు. ఇండియా కూటమి సమావేశానికి హాజరుకానంత మాత్రాన ఎన్డీఏకు మద్దతు ఇస్తున్నట్లు కాదని పేర్కొన్నారు.

**ఇండియా కూటమి కీలక సమావేశం**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విషయంలో ఈసీలో భేదాభిప్రాయాలు ఉన్నాయన్న వార్తలు దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలనే డిమాండ్‌తో పాటు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై చర్చించేందుకు సెప్టెంబర్ 30న ఇండియా కూటమి సమావేశానికి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో డీఎంకే ఇండియా కూటమి నుంచి వైదొలగడంతో పాటు సమావేశానికి కూడా హాజరు కావడం లేదని తెలిపింది. ఇక, ముందస్తు షెడ్యూల్ కారణంగా యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడా ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం లేదు. సమాజ్ వాదీ పార్టీ తరుపున సీనియర్ నేత ఈ సమావేశానికి హాజరు కానున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- మొదటి పేజి తరువాయి

గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం.. ఆరుగురు మృతి

- మొదటి పేజి తరువాయి

ప్రాంతంలోని క్రాస్నోయరోవో గ్రామానికి సమీపంలో మంగళవారం (సెప్టెంబర్ 29) ఈ ప్రమాదం జరిగింది. సాంకేతిక కారణాలతో టేకాఫ్ అయిన కాసేపటికే విమానం కుప్పకూలింది. ప్రమాద సమయంలో విమానంలో మొత్తం ఏడుగురు ఉన్నారు. ఇందులో ఆరుగురు మరణించగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. జనవాసాలు లేని ప్రదేశంలో విమానం కుప్పకూలడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణం ఏంటన్నది ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేప్టటారు. ఫ్లైట్ క్రాష్?కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఈ వీడియోలో.. కుప్పకూలగానే విమానం ఇంధనం ట్యాంకులు పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగడం కనిపించింది.

# పల్లె పండుగ 3.0 ప్రారంభం.. గ్రామాలకు రూ.11,085 కోట్లు

- మొదటి పేజి తరువాయి

అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

**ఉదయగిరికి వరాల జల్లు**

ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు.

65,000 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ.52.52 కోట్లు.

90,000 ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 భూసేకరణకు రూ.85 కోట్లు.

రూ.3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉద్యోగాలిచ్చే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉదయగిరిని తీర్చిదిద్దేందుకు అవసరమైన క్లియరెన్సులు.

కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లు.

వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-2ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం**

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు

ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వినూత్న సంస్కరణలను సింగపూర్ ప్రభుత్వం ప్రశంసించింది. రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని సింగపూర్ హోం, న్యాయశాఖల మంత్రి కె. షణ్ముగం హామీ ఇచ్చారు. మంగళవారం తిరుమలలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఆయన భేటీ అయ్యారు. శ్రీవారి దర్శనం అనంతరం ఇరువురు నేతలు రాష్ట్ర అభివృద్ధి, విద్యా సంస్కరణలు, మాదకద్రవ్యాల నివారణ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, ముఖ్యంగా విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పనితీరుతో పాటు విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను మంత్రి షణ్ముగం ఈ సందర్భంగా అభినందించారు. పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును సున్నా శాతానికి తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి షణ్ముగం సూచించారు. బడి మానేసే పిల్లలే భవిష్యత్తులో మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సింగపూర్ తరహా కఠిన చట్టాలు అవసరమని అభిప్రాయపడుతూ, డ్రగ్స్ రహిత ఏపీ నిర్మాణానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న తీరును మంత్రి లోకేశ్ వివరించగా, ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా సందర్శించేందుకు మంత్రి షణ్ముగం ఆసక్తి వ్యక్తం చేశారు. అలాగే, యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించే లక్ష్యంతో ఏపీలోని ఐటీఐలను సింగపూర్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (ఐటీఈ)తో అనుసంధానించేందుకు పరస్పరం సహకరించుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి**

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.

**రూ.11,085 కోట్లతో 'పల్లె పండుగ 3.0'**

'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.

**ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు**

ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.

**అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం**

అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు.

రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## నలుగురు సహోద్యోగులను కాల్చి చంపిన సీఐఎస్ఎఫ్ జవాన్

జమ్మూకశ్మీర్‌లో తీవ్ర విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)కు చెందిన ఒక జవాన్ తన సహోద్యోగులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక ఉన్నతాధికారి కూడా ఉన్నారు. కతువా జిల్లాలోని సేవా-2 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద ఈ దారుణం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కతువా జిల్లాలోని బసోహ్లి ప్రాంతంలో ఉన్న సేవా-2 హైడల్ పవర్ ప్రాజెక్టుకు సీఐఎస్ఎఫ్ సిబ్బంది భద్రత కల్పిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో డ్యూటీ మార్పు జరుగుతుండగా, హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్ అనే జవాన్‌కు, ఇతర సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో ఆగ్రహంతో ఊగిపోయిన అవధేశ్ సింగ్, తన వద్ద ఉన్న తుపాకీతో సహోద్యోగులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో అసిస్టెంట్ కమాండెంట్ అంకిత్ కుమార్ పాండే, సబ్-ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సింగ్, కానిస్టేబుళ్లు రఫిక్ అహ్మద్, సందీప్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సంఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన ఇతర సిబ్బంది, నిందితుడు అవధేశ్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని, కతువా పోలీసులకు అప్పగించారు. కతువా ఎస్ఎస్‌పి మోహితా శర్మ ఈ ఘటనను ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయం ఈ ఘటనపై తీవ్రంగా స్పందించింది. వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు ఉన్నతస్థాయి విచారణకు (కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ) ఆదేశించింది. సీఐఎస్ఎఫ్ డీజీ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేవలం చిన్న వాగ్వాదమే ఈ దారుణానికి కారణమా లేక మరేదైనా నేపథ్యం ఉందా అనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. ఒకే దళానికి చెందిన సిబ్బంది మధ్య జరిగిన ఈ కాల్పుల ఘటన (ఫ్రాట్రిసైడ్) తీవ్ర కలకలం రేపింది.

## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మరణించిన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఒంగోలులోని రాజశేఖర్ నివాసానికి వెళ్లిన జగన్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

కాగా, విజయవాడలో సెప్టెంబర్ 21న డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ చేపట్టిన నిరసనలో జరిగిన తోపులాట అనంతరం రాజశేఖర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. రాజశేఖర్ గతంలో లిడ్?క్యాప్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

## అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి

అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి అందాలని, వారి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి అంటే అందరినీ ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని వీలైనంతగా తగ్గించడమేనని ఆయన స్పష్టం చేశారు. 'కొంతమందికే గరిష్ఠ ప్రయోజనం' చేకూరాలన్న వాదనను తాను వ్యతిరేకిస్తున్నానని, దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశించినట్లుగా 'అందరికీ మేలు' జరగాలని భగవత్ ఆకాంక్షించారు. ఏ నిర్ణయం తీసుకున్నా సమాజంలోని అత్యంత నిరుపేద వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్న మహాత్మా గాంధీ సూత్రాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రతి వ్యక్తికి కూడు, గుడ్డ, నీడ వంటి ప్రాథమిక అవసరాలతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించి, వారు గౌరవప్రదంగా జీవించేలా చూడటమే నిజమైన అభివృద్ధి అని ఆయన వివరించారు. రైతులు రుణాల ఊబిలో కూరుకుపోకుండా సేంద్రియ, మిశ్రమ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, విత్తనాలు, ఎరువుల విషయంలో స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. ప్రగతి పేరిట ప్రకృతిని విధ్వంసం చేయకూడదని హితవు పలికారు. అభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, సమాజం కూడా తన వంతు పాత్ర పోషించాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు.

దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

భారత్-అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా ఒక పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందని, పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆయన దుయ్యబట్టారు. "అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే, అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే, సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతో పాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ వివరించారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్న తరుణంలో జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందుకు భారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# అర్హులైన అందరికీ పట్టాలివ్వడమే ప్రభుత్వం లక్ష్యం



**గాజువాక :పెన్ పవర్ ,సెప్టెంబర్ 29** పేదవాడి సొంతింటి కల నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక క్లబ్ లో పల్లా పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. సెప్టెంబర్ 19 న ఇంజనీరింగ్ కాలేజీలో సీఎం చంద్రబాబు 29 వేల మందికి పట్టాలు అందజేశారని, అర్హులైన అందరికీ పట్టాలివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని, మరో వైపు త్వరలో టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తున్నామని, నియోజకవర్గంలో పెండింగ్ లోని దరఖాస్తుదారులకు త్వరలో పట్టాలు ఇచ్చేలా చర్యలను తీసుకుంటామని పల్లా హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పెన్ పవర్ ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# ఏబులం టేకులవీధిలో నిర్మాణంపై పీసా కమిటీ అభ్యంతరం





**అనుమతులపై స్పష్టత ఇవ్వాలని అధికారులకు వినతి**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ సచివాలయం-2 పరిధిలోని ఏబులం టేకులవీధి గ్రామంలో జరుగుతున్న ఓ నిర్మాణానికి సంబంధించి అనుమతులు, ఆధార పత్రాలపై స్పష్టత ఇవ్వాలని స్థానిక పీసా కమిటీ ప్రతినిధులు కోరారు.గ్రామంలో జరుగుతున్న నిర్మాణ పనులను పీసా కమిటీ ప్రతినిధులు గబులంగి గణేశ్, కొయ్యం ఇమాన్యుల్ (సిద్దు) మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాలు అక్కడ అందుబాటులో లేవని వారు గుర్తించి, ఈ విషయాన్ని మండల పీసా కమిటీ దృష్టికి తీసుకువచ్చారు.ఈ అంశంపై పీసా మండల కమిటీ అధ్యక్షులు కొర్ర బలరాం, కార్యదర్శి మాదిరి చంటిబాబు మాట్లాడుతూ నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పంచాయతీ శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అధికారులు పరిశీలించి స్పష్టత ఇవ్వాలని కోరారు. నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నట్లయితే ఎలాంటి అభ్యంతరం లేదని, లేనిపక్షంలో సంబంధిత నిబంధనల మేరకు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని సూచించారు.షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నిర్మాణాలు, భూముల వినియోగానికి సంబంధించిన నిబంధనలను పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, స్థానికుల సందేహాలను నివృత్తి చేసే విధంగా పూర్తి వివరాలను వెల్లడించాలని కోరారు.ఈ విషయంపై గూడెంకొత్తవీధి తహశీల్దార్ హెచ్. అన్నాజీరావు వివరణ కోరగా అయన స్పందిస్తూ.. సంబంధిత నిర్మాణానికి రెవెన్యూ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు జారీ కాలేదని తెలిపారు. నిర్మాణానికి సంబంధించిన అంశాలపై తక్షణమే విచారణ చేపట్టేందుకు అధికారులను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సింహాద్రి నాథుని నిత్య అన్నప్రసాదానికి రూ.1.లక్ష విరాళం



**సింహాచలం, పెన్ పవర్, సెప్టెంబర్ 29** :సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద కార్యక్రమానికి కూర్మన్నపాలెం శాతవాహననగర్‌కు చెందిన ఎల్.భాస్కరం రూ.1,00,016 విరాళంగా అందజేశారు. మంగళవారం సింహాచలం ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావును కలిసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెక్కు నంబర్ 429054 ద్వారా ఈ విరాళాన్ని అందించారు. విరాళాన్ని స్వీకరించిన అనంతరం ఆలయ అధికారులు దాతకు స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రంతో దాతను సత్కరించి ప్రసాదాలను అందజేశారు. సింహాచల క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమానికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని ఆలయ ఈవో జల్లేపల్లి వెంకట్రావు పేర్కొంటూ, ఎల్. భాస్కరంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 2012లో మొదలు.. నేటికీ పిల్లర్ల వద్దే పాఠశాల!

### 14 ఏళ్లుగా అసంపూర్తిగా బంధవీధి ఎంపీపీ స్కూల్ భవనం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ బంధవీధి గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం 14 ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయింది. 2012లో ప్రారంభమైన ఎంపీపీ పాఠశాల భవన నిర్మాణం పిల్లర్ల దశకే పరిమితమై, ఇంతకాలం గడిచినా పూర్తికి నోచుకోలేదు.పాఠశాల భవనం అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు. నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో భవనం పూర్తవుతుందా లేదా అనే సందేహం నెలకొన్నదన్నారు. పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు.ఈ సమస్యపై గ్రామస్తులు మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి బీహెచ్‌వీ రమణబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాల భవన నిర్మాణం ఎందుకు నిలిచిపోయిందో పరిశీలించి, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.ఎంపీడీవోను కలిసిన వారిలో వంతల సత్తిబాబు, వెలుగురి వెంకటరావు, కిల్లో సన్యాసిరావు, వంతల పాపారావు, సంధ్య రమణ తదితరులు ఉన్నారు.

# 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు కావాలి



- విద్యార్థులు సాధారణ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి:
- జిల్లా కలెక్టర్ టి.నిషాంతి

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**ఎస్‌వీఈఈపీ--ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకునే విధానంపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ శ్రీమతి నిషాంతి.టి, ఐఏఎస్ మంగళవారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు ఫారం--6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో పరిశీలించుకోవాలని తెలిపారు.

**ప్రస్తుత అంశాలపై అవగాహన అవసరం:**

జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు వినూత్న కార్యక్రమాల గురించి కలెక్టర్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా జిల్లా, రాష్ట్ర, దేశానికి సంబంధించిన ప్రస్తుత అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ఆసక్తికరంగా ముచ్చటిస్తూ సాధారణ జ్ఞానానికి సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి వారి అవగాహనను తెలుసుకున్నారు. సరైన సమాధానాలు ఇచ్చిన విద్యార్థులను బహుమతులతో అభినందించి, మరింత జ్ఞానాన్ని సంపాదించేలా ప్రోత్సహించారు.విద్యార్థులు ప్రతిరోజూ వార్తాపత్రికలు చదవడంతో పాటు సమాజం, రాష్ట్రం, దేశంలో చోటుచేసుకుంటున్న ముఖ్యమైన పరిణామాలను తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. సాధారణ జ్ఞానం, సమకాలీన అంశాలపై అవగాహన విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

**ఓటు హక్కుపై యువతకు అవగాహన:**

ఎస్‌వీఈఈపీ కార్యక్రమం ద్వారా యువతలో ఓటు హక్కు, ఓటరు నమోదు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత కలిగిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ, పీడీ--డీఆర్‌డీఏ, కళాశాల అధ్యాపకులు, ఎన్నికల అధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి రూ.11,085 కోట్లు....



- నాతవరం మండలం లో పల్లె పండుగ 3.0 ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు....
- డీ.ఎర్రవరంలో రూ.96 లక్షల పనులకు శంకుస్థాపన......

**నాతవరం,పెన్ పవర్ (సెప్టెంబర్ 29):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎదీ-+-=ూవీ-+ పథకం ద్వారా రాష్ట్రానికి రూ.11,085 కోట్ల నిధులు మంజూరు చేశాయని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. నాతవరం మండలం డీ.ఎర్రవరంలో మంగళవారం నిర్వహించిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.నర్సీపట్నం నియోజకవర్గానికి మొత్తం 421 పనులకు రూ.43.59 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నాతవరం మండలంలో 148 పనులకు రూ.21.86 కోట్లు కేటాయించగా, డీ.ఎర్రవరంలో అమ్మవారి గుడి రోడ్డుకు రూ.80 లక్షలు, అంతర్గత రోడ్డుకు రూ.16 లక్షలు కలిపి రూ.96 లక్షల పనులకు భూమిపూజ చేశారు.నాతవరం మండలంలోని 31 పంచాయతీల పరిధిలో రూ.14.70 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు స్పీకర్ వెల్లడించారు. పనుల నాణ్యతను ప్రజలు, స్థానిక నాయకులు దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు. రాబోయే మూడేళ్లలో నర్సీపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన కరక సత్యనారాయణ,మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు,నందిపల్లి వెంకటరమణ, గన్నవరం పిఏసిఎస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసి దేవుడు,నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగా వెంకటకృష్ణారావు,టిడిపి సీనియర్ నాయకులు చింతల బెన్నయ్య నాయుడు,టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు ఇనప సప్పుల సత్యవతి, ఆర్డీవో వివి రమణ,మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు శెట్టి లోవ అధికారులు, కూటమి నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ స్వామివారిని దర్శించుకున్న ఎస్ఎస్‌సీ చైర్మన్ గోపాలకృష్ణన్



**ఉన్నతాధికారుల బృందంతో స్వామివారికి ప్రత్యేక పూజలు**

**సింహాచలం, పెన్ పవర్, సెప్టెంబర్ 29** :సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారిని భారత ప్రభుత్వ పర్సనల్, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సి) చైర్మన్ ఎస్. గోపాలకృష్ణన్, ఐఏఎస్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఎస్ఎస్‌సీ ఉన్నతాధికారుల బృందం స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఆలయానికి విచ్చేసిన ఎస్ఎస్‌సీ చైర్మన్, ఉన్నతాధికారుల బృందానికి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ జల్లేపల్లి వెంకట్రావు స్వాగతం పలికారు. అనంతరం అధికారులు ఆలయ ప్రాంగణంలోని మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు అధికారులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఈవో జల్లేపల్లి వెంకట్రావు శేషవస్త్రంతో అధికారులను సత్కరించి, స్వామివారి ప్రసాదాలతో పాటు జ్ఞాపికగా స్వామివారి దివ్య చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌సీ సభ్యులు రాజీవ్ శ్రీవాస్తవ, ఆర్.కె. జైన్, సెక్రటరీ కమ్ సీవోఈ సతీష్ టి.జె., డైరెక్టర్లు శ్రీ అశోక్ కుమార్ బవాలియా, అభిషేక్ కేసర్వాణి, అనూప్ కుమార్, వరిందర్ సింగ్, రీజినల్ డైరెక్టర్లు రాగుల్ కె. (ఎస్సార్), పారిజత్ దివాన్ (ఎంపీఆర్), మనీష్ ముఖర్జీ (ఎన్ఆర్), సురేంద్ర కుమార్ (ఎన్డబ్ల్యూఆర్), చింత ఎ. ఇస్సాక్ (డబ్ల్యూఆర్) తదితరులు పాల్గొన్నారు.

## నాతవరం హెచ్ స్కూల్‌లో ఎస్ఎంసీ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.....

చైర్మన్‌గా బంగారు జ్యోతి.. వైస్ చైర్మన్‌గా మకారపు దేవి.....



**నాతవరం,పెన్ పవర్ (సెప్టెంబర్ 29):**నాతవరం హెచ్ స్కూల్‌లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నూకరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ఎస్ఎంసీ చైర్మన్‌గా బంగారు జ్యోతి, వైస్ చైర్మన్‌గా మకారపు దేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారంతా మహిళలే కావడం విశేషం. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బంగారు సూరిబాబు, గ్రామ పెద్దలు,విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని ఎన్నికలను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే.నూకరత్నం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసీ సభ్యులు చురుకుగా భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని,పాఠశాలలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలకు హాజరై సహకరించాలని సూచించారు.

## నాతవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు......

- చైర్మన్‌గా ముమ్వల వెంకటలక్ష్మి..
- వైస్ చైర్మన్‌గా కోళ్ల సత్యవేణి ఏకగ్రీవ ఎన్నిక.....




**నాతవరం,పెన్ పవర్ (సెప్టెంబర్ 29):** నాతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూండ్రపు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో ఎస్ఎంసీ చైర్మన్‌గా ముమ్వల వెంకటలక్ష్మి, వైస్ చైర్మన్‌గా కోళ్ల సత్యవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కూడా మహిళలే ఎన్నిక కావడం విశేషంగా నిలిచింది.ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులతో ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లో ఎస్ఎంసీ సభ్యులు చురుకుగా పాల్గొనాలని,విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని,విద్యార్థుల తల్లిదండ్రులతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు.ఈ కార్యక్రమంలో పీఎస్‌సీఎస్ అధ్యక్షులు అప్పిరెడ్డి మాణిక్యం,గ్రామ పెద్దలు నేతల విజయ్‌కుమార్,పైల పోతురాజు,పైల సూరిబాబు,బంగారు సూరిబాబు,ఇట్టంశెట్టి సీతారాం,రెడ్డి వరహాలు బాబు,శెట్టి లోవ తదితరులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కె. గోపాలకృష్ణ, ఆంగ్ల ఉపాధ్యాయులు కె. రవిశంకర్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# నాతవరం మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు....

- 41 పాఠశాలల్లో ఏకగ్రీవ ఎన్నికలు....
- 17 పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి......
- కోరం లేక మూడు పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా.....
- పర్యవేక్షించిన విద్యాశాఖ అధికారులు ఎస్.బ్రహ్మాజీ,కే.వరహాలు బాబు....



**నాతవరం,పెన్ పవర్ (సెప్టెంబర్ 29):** నాతవరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులు,విద్యార్థుల ప్రతినిధుల భాగస్వామ్యంతో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. మండలవ్యాప్తంగా మొత్తం 61 పాఠశాలల్లో 41 పాఠశాలలకు ఎస్ఎంసీ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, 17 పాఠశాలల్లో ఎన్నికలు సక్రమంగా నిర్వహించి కమిటీలను ఏర్పాటు చేశారు.అయితే జడ్పీహెచ్‌ఎస్ ఎర్రవరం, జడ్పీహెచ్‌ఎస్ చమ్మచింత, జీహెచ్ స్కూల్ తాండవ పాఠశాలల్లో నిర్ణీత కోరం లేకపోవడంతో ఎన్నికల ప్రక్రియను వాయిదా వేశారు. ఆయా పాఠశాలల్లో నిబంధనల ప్రకారం కోరం సమకూరిన అనంతరం తదుపరి తేదీలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు ఎస్.బ్రహ్మాజీ,కే.వరహాలు బాబు తెలిపారు.ఎన్నికల సందర్భంగా పాఠశాలల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. మండల విద్యాశాఖ అధికారులు ఎస్. బ్రహ్మాజీ, కే. వరహాలు బాబు ఆయా పాఠశాలలను సందర్శించి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎన్నికల నిర్వహణ సిబ్బందికి సూచనలు చేశారు.అదేవిధంగా పాఠశాలల వద్ద శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నాతవరం ఎస్సై వై. తారకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించి పరిస్థితిని పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.ఎన్నికైన ఎస్ఎంసీ కమిటీలు పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల కల్పన తదితర అంశాల్లో పాఠశాల యాజమాన్యంతో సమన్వయంతో పనిచేయనున్నాయి.

# హెచ్‌పీసీఎల్ అధికారులతో ప్రభుత్వ విప్ గణబాబు భేటీ

**ములగాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 29 :**వర్షపు నీటి పారుదల సమస్యకు శాశ్వత పరి ష్కారం చూపాలని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చి మ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు గణబా బు హెచ్‌పీసీఎల్ అధికారులను కోరారు.ఈ మే రకు హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిషేక్ త్రివేది, సీజీఎం (హెచ్‌ఆర్) జి. కిరణ్ కుమార్‌లతో గణబాబు సమావేశమ య్యారు. ఈ సందర్భంగా గొల్లపాలెం, రామ్‌నగ ర్ గెద్దల గుండా వర్షపు నీరు సాఫీగా ప్రవహిం చకుండా హెచ్‌పీసీఎల్ పరిధిలోని పలు అడ్డంకు ల కారణంగా నీరు నిలిచిపోతూ వరద ముప్పు ఏర్పడుతోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వర్షాలు కురిసిన సమయంలో సమీప ప్రాంతా ల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆయన వివరించారు. గెద్దల్లో పేరుకు పోయిన పూడిక, ఇతర అడ్డంకులను తక్షణమే తొలగించి, వర్షపు నీరు ఎలాంటి ఆటంకం లేకుండా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరారు.
అదేవిధంగా భవిష్యత్తులో వరద సమస్య పున రావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని హెచ్‌పీసీఎల్ ఉన్నతాధికారులకు గణబాబు విజ్ఞప్తి చేశారు.



# అంగన్వాడీ కార్యకర్త ఆయాలకు ఘన సన్మానం...!




**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 29:**భారత ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా బిజెపి మండల నేతలు రాజేంద్రపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. బిజెపి మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరీపార్వతి ఆధ్వర్యంలో కొయ్యూరు మండల సేవా సంకల్ప అభియాన్ ఇంచార్జి, మండల ప్రధాన కార్యదర్శి డి పద్మరాజు, బిజెపి మండల అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపోయిన చక్రరావు (చిన్న ), జిల్లా ఉపాధ్యక్షురాలు కాకర ఉష, బీసీ మోర్చ మండల అధ్యక్షుడు గాలి దేవుడు పాల్గొని అంగన్వాడీలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న గుడ్లు ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. గర్భిణీలు, బాలింతలకు అందే పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న రాజేంద్రపాలెం అంగన్వాడీ కేంద్ర కార్యకర్త వెంకటరమణమ్మ, హెల్పర్ లింగేటి నాగమణి లతో పాటు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిడిపివో సత్యశ్రీ ని నేతలు సాలువాతో సత్కరించారు. అంగన్వాడి చిన్నారులకు, కిషోర బాలికలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈనెల 25 నుండి అక్టోబర్ 7 వరకు మండలంలోని వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సత్యశ్రీ, అంగన్వాడి సూపర్ వైజర్లు సత్యవతి, విజయలక్ష్మి, బాలమణి , బిపిసి గుమ్మడి సోమశేఖర్ అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుకు నైపుణ్యాలే కీలకం: గణబాబు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 29 :**రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో యువత పాత్ర కీలకమ ని ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు గణబా బు అన్నారు. విశాఖ నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల, మహతి డిగ్రీ కళాశాలల్లో నిర్వహిం చిన 'యువతకు భరోసా' టౌన్‌హాల్ కార్యక్రమా ల్లో ఆయన విద్యార్థులతో ముఖాముఖి మాట్లా డారు. విద్యార్థుల కెరీర్ లక్ష్యాలు, ఉద్యోగ అవ కాశాలు, భవిష్యత్ అవసరాలపై చర్చించారు.ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్ వంటి సాంకేతిక రంగాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచిం చారు. వైద్యం, ఇంజినీరింగ్, డిజైనింగ్ తదితర రంగాల్లో ఏఐ వినియోగం పెరుగుతున్నందున భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా ర్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకో వాలని అన్నారు.విశాఖపట్నంలో ఐటీ, పారిశ్రా మిక రంగాల అభివృద్ధితో స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఐటీ కారిడార్లు, భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయం, వివిధ పారిశ్రామిక ప్రాజెక్టుల ద్వారా నగరంలో మౌలిక సదుపాయాలు మరింత అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. గ్లోబల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించేలా డిగ్రీ పూర్త య్యేలోగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.
హైదరాబాద్‌లో ఐటీ రంగం అభివృద్ధికి గతంలో చేపట్టిన చర్యలను ప్రస్తావించిన గణబాబు.. అదే తరహాలో విశాఖపట్నాన్ని కూడా అంతర్జా తీయ స్థాయి ఐటీ కేంద్రంగా అభివృద్ధి చేసేందు కు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గూగుల్‌తో పాటు పలు అంతర్జాతీయ, బహు ళజాతి సంస్థలను విశాఖకు ఆకర్షించే ప్రయత్నా లు జరుగుతున్నాయని పేర్కొన్నారు.
నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి, పరిశ్రమ లు, పర్యాటక రంగాల విస్తరణ ద్వారా యువ తకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని గణ బాబు అన్నారు. ఉద్యోగాలు, అభివృద్ధి అంశా లపై వచ్చే వివిధ అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకుంటూనే విద్యార్థులు తమ కెరీర్ లక్ష్యాలపై దృష్టి సారించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపా ళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు గణబాబు సమాధానాలు ఇచ్చారు.

# వైఎస్ఆర్‌సీపీని వీడలేదు.. ప్రచారం అవాస్తవం: కుందరి రామకృష్ణ

దామనపల్లిలో వైఎస్ఆర్‌సీపీ బలంగానే ఉంది

**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29**: దామనపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ కుందరి రామకృష్ణ కుటుంబ సభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి జనసేన పార్టీలో చేరినట్లు వచ్చిన వార్తలు అవాస్తవమని మాజీ సర్పంచ్ కుందరి రామకృష్ణ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంగళవారం తన స్వగృహంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ.. కుందరి నాగరాజు, వీరమ్మ దంపతులు తమ ఇంటి పేరు వారే తప్ప తమ కుటుంబ సభ్యులు కారని తెలిపారు. వీరమ్మ గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి ఎంపీటీసీగా పోటీ చేసి ఓడిపోయారని, 2013 సర్పంచ్ ఎన్నికల్లో కుందరి నాగరాజు (కె. రామకృష్ణ పేరుతో) కాంగ్రెస్ పార్టీ తరఫున తనపై పోటీ చేసి 900కు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారని పేర్కొన్నారు. నాగరాజు పార్టీలు మారడం కొత్తేమీ కాదని అన్నారు.తమ మధ్య ఉన్న కుటుంబ విభేదాల నేపథ్యంలో రాజకీయ స్వలాభం కోసం నాగరాజు కొంతమందిని వివిధ పార్టీల నుంచి తీసుకువచ్చి జనసేనలో చేర్చుకున్నారని ఆరోపించారు. దేవాలయానికి సంబంధించిన సమావేశమని చెప్పి కొంతమంది ప్రజలను తీసుకువచ్చి పార్టీలో చేర్చుకున్నారని, అయితే 200 మంది పార్టీలో చేరారంటూ ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. దామనపల్లి గ్రామ ప్రజలు ఎవరూ ఆయన వెంట వెళ్లలేదని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోనే బలంగా ఉన్నారని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో జిల్లాలో పార్టీ బలంగా ఉందని అన్నారు. జనసేన పార్టీ అల్లూరి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జానపద కళల అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య పార్టీ బలోపేతం పేరుతో ఎన్నికల్లో గెలవని కుందరి నాగరాజు, వీరమ్మ దంపతులను పార్టీలో చేర్చుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇకపై పార్టీలోకి ఇతరులను చేర్చుకునే ముందు వారి రాజకీయ నేపథ్యాన్ని తెలుసుకోవాలని సూచించారు.త్వరలో దామనపల్లి గ్రామంలోని ఏడు వీధుల ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఎంత బలంగా ఉన్నారో తెలియజేస్తామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దామనపల్లి పంచాయతీలో ఎంపీటీసీ, సర్పంచ్ పదవులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు.ఈ సమావేశంలో పంచాయతీ వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు ఎస్. సత్తిబాబు, మండల ప్రధాన కార్యదర్శి వి. చంటిబాబు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ అరకు ఎర్మయ్య, పంచాయతీ వైస్ సర్పంచ్ చిలకమ్మ, పంచాయతీ పీసా అధ్యక్ష కార్యదర్శులు చెర్రెకు బాలరాజు, సీనియర్ కరయ్య, మాజీ వార్డు సభ్యులు, పంచాయతీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



# వైసీపీలోకి 30 కుటుంబాలు చేరికలు ప్రచారం అవాస్తవం...!

- టీడీపీ మండల కమిటీ సభ్యులు తాజా మాజీ సర్పంచ్ భర్త పనసలా రాము కౌంటర్



**కోయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 29 :** టిడిపి నుంచి వైసీపీలోకి 30 కుటుంబాలు చేరినట్లు వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని టీడీపీ సభ్యులు పనసలా రాము స్పష్టం చేశారు. టిడిపి కి చెందిన 30 కుటుంబాలు పార్టీని వీడి వైసీపీలో చేరినట్లు ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ ప్రచారమేనని ఆయన అన్నారు. తాము చూపిస్తున్న 30 కుటుంబాల్లో ఎంతమందికి టీడీపీ సభ్యత్వం ఉందో, ఎప్పటి నుంచి వారు పార్టీలో ఉన్నారో, ఏ కార్యక్రమాల్లో టీడీపీ తరఫున పనిచేశారో ఆధారాలతో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.టిడిపి సభ్యత్వం కూడా లేని వ్యక్తులను వెంటబెట్టుకుని,వారిని టిడిపి కుటుంబాలుగా చూపించి పార్టీ మార్పులుగా ప్రచారం చేయడం ఏ విధంగా సమర్థనీయం?" అని రాము ప్రశ్నించారు.రాజకీయంగా ప్రజలను ప్రభావితం చేయడానికి సంఖ్యలను పెంచి చూపించడం, లేని పార్టీ మార్పులను ఉన్నట్లుగా ప్రచారం చేయడం ద్వారా వాస్తవాలను మార్చలేరని ఆయన అన్నారు. నిజంగా 30 కుటుంబాలు టీడీపీని వీడి వైసీపీలో చేరి ఉంటే వారి టీడీపీ సభ్యత్వ వివరాలు, పార్టీతో వారి అనుబంధానికి సంబంధించిన ఆధారాలు, వైసీపీలో చేరినట్లు నమోదైన వివరాలు బహిరంగంగా వెల్లడించాలని సవాల్ చేశారు.

## రైల్వే భద్రతా కమిషనర్ సమగ్ర భద్రతా తనిఖీ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 29. :**దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ దక్షిణ మధ్య సర్కిల్‌కు చెందిన రైల్వే భద్రతా కమిషనర్ మాధవి విశాఖపట్నం రైల్వే విభా గంలో సమగ్ర భద్రతా తనిఖీ నిర్వ హించారు. విశాఖపట్నం నుంచి కునేరు పట్టణ రైల్వే స్టేషన్ వరకు ఆమె భద్రతా పరిస్థితులను క్షుణ్ణంగా పరి శీలించారు.తనిఖీలో భాగంగా నా ర్త్ సింహాచ లం రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ మార్గ సంకేతాల అనుసంధాన) గది, గొట్లాం రైల్వే స్టేష న్‌లో రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్ చేపడుతున్న పనులు, లెవల్ క్రాసింగ్ గేట్ నంబరు 463 తో పాటు మధ్య మార్గంలోని వివిధ భద్రతా అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా రైల్వే మార్గాలు, సంకేత వ్యవస్థలు, గేట్ల నిర్వహణ, నిర్మాణ పనులు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికు ల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, ని బంధనలను కచ్చితంగా పాటించాలని అధికారు లకు సూచించారు.
విశాఖపట్నం రైల్వే విభాగం విభాగీయ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రాతో పాటు వివిధ శాఖ లకు చెందిన ఉన్నతాధికారులు రైల్వే భద్రతా కమిషనర్ నిర్వహించిన తనిఖీలో పాల్గొని అవసరమైన వివరాలను అందించారు.

# వైబి పట్నం ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా ముప్పల లోవరాజు ఏకగ్రీవ ఎన్నిక......

**నాతవరం,పెన్ పవర్ (సెప్టెంబర్ 29):** నాతవరం మండలం వైబి పట్నం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ ఎన్నిక మంగళవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు ఆర్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ ఎన్నికల సందర్భంగా ముప్పల లోవరాజు ఎస్ఎంసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్ ఎన్నిక ప్రక్రియకు మాజీ డీసీసీబీ డైరెక్టర్ కూండ్రపు అప్పలనాయుడు తల్లిదండ్రుల సమక్షంలో ఎలాంటి పోటీ లేకుండా ముప్పల లోవరాజు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పలువురు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ అప్పలనాయుడు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసీ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని,విద్యార్థులకు మెరుగైన విద్య, మౌలిక వసతులు,పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల కోసం కమిటీ సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.నూతనంగా ఎన్నికైన చైర్మన్ ముప్పల లోవరాజుకు తెలుగుదేశం పార్టీ తరఫున ప్రత్యేక




ధన్యవాదాలు,అభినందనలు తెలిపారు.పాఠశాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు వాతావరణం కల్పించాలని ఈ సందర్భంగా పలువురు కోరారు.

# సిఆర్పిఎఫ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ అభియాన్



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 29.** అల్లూరి జిల్లా సిఆర్పిఎఫ్ డి.ఎస్.పి ముఖేష్ కుమార్ ఆదేశాలతో ముంచంగిపుట్టు మండల కేంద్రంలో జీ /198 బెటాలియన్ సిఆర్పిఎఫ్ సిబ్బంది పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. స్వచ్ఛభారత్ అభియాన్ ఆశయాన్ని సహకరించడం సిఆర్పిఎఫ్ ఒక ముఖ్య ఉద్దేశమని, పౌరులతో కలిసి కలిసి స్వచ్ఛ భారత్ అభియాన్ శాంతియుతంగా నిర్వహించారు. ముంచంగిపుట్టు పరిసర ప్రాంతాల్లో స్వస్థ అభియాన్ ను వ్యాప్తి చేయడమే తమ లక్ష్యంగా సీఆర్పీఎఫ్ జీ/198 బెటాలియన్ తెలిపారు. అంతర్గత భద్రతలోను కీలక పాత్ర పోషించి సేవలందించే సిఆర్పిఎఫ్ జవాన్లు సమాజ సేవలోనూ తాము ఎప్పుడు ముందుంటామని ఈ స్వచ్ఛభారత్ కార్యక్రమాల ద్వారా నిరూపిస్తున్నారు.

## వివాదాలకు తావులేకుండా ఎస్ఎంసీ ఎన్నికలు

తహశీల్దార్ హెచ్.అన్నాజీరావు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలను వివాదాలకు తావులేకుండా నిర్వహించాలని తహశీల్దార్ అన్నాజీరావు సూచించారు.మంగళవారం రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా సాగుతున్న తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకమని అన్నారు. ఏకగ్రీవ ఎన్నికలకు అవకాశం ఉంటే అందుకు ప్రాధాన్యం ఇవ్వాలని, పోటీ ఏర్పడితే నిబంధనల ప్రకారం బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు.రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాలలో 625 మంది ఓటర్లు ఉండగా, 25 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుమిత్ర, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ బీచ్ రోడ్డులో అరకు కాఫీ కేంద్రం

## నిర్మాణ పనులను పరిశీలించిన జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్




**విశాఖ దక్షిణం పెన్ పవర్ సెప్టెంబర్ 29 :**
విశాఖపట్నం బీచ్ రోడ్డులో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో రూ.1.06 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న అరకు లోయ కాఫీ కేంద్రా న్ని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ సంద ర్శించారు. జీసీసీ సంచాలకులతో కలిసి నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బీచ్ రోడ్డుకు వచ్చే పర్యాటకులు, ప్రజలకు అరకు లోయ కాఫీ రుచి ని అందించడంతో పాటు, గిరిజన సహకార సం స్థ ఆధ్వర్యంలో లభించే వివిధ గిరిజన ఉత్పత్తు లను అందుబాటులోకి తీసుకురావడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.కాఫీ కేంద్రం కింది అంతస్తులో అరకు లోయ కాఫీతో పాటు గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో లభించే వివిధ గిరిజన ఉత్పత్తులను విక్రయానికి అందు బాటులో ఉంచనున్నారు.పై అంతస్తులో కాఫీ అనుభూతి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. గిరిజన రైతులు కాఫీ పంటను ఏ విధంగా సాగు చేస్తారు, కాఫీ పండ్లను ఎలా సేకరిస్తారు, పంట దిగుబడి ఎలా వస్తుంది, సేకరించిన కాఫీని ఏ విధంగా శుద్ధి చేసి వినియోగానికి సిద్ధం చేస్తారు అనే అంశాలను సందర్శకులకు ప్రత్యక్ష అను భూతి కలిగించేలా ప్రదర్శించనున్నారు.అరకు కాఫీ సాగు నుంచి కప్పులోకి చేరే వరకు జరిగే మొత్తం ప్రక్రియను ప్రజలకు, పర్యాటకులకు పరిచయం చేయడంతో పాటు, గిరిజన రైతుల శ్రమ, వారి ఉత్పత్తులకు లభించే మార్కెటింగ్ అవకాశాలను వివరించేలా కాఫీ అనుభూతి కేంద్రాన్ని రూపొందిస్తున్నట్లు కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు.అరకు లోయ కాఫీకి మరింత ప్రాచుర్యం కల్పించడంతో పాటు, గిరిజన రైతు లు ఉత్పత్తి చేసే వివిధ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు గిరిజన సహకార సంస్థ చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో జీసీసీ సంచాలకులు బొర్రా నాగరాజు, జీవుల నాయక్, కన్నప్ప రాజు, నిభ్ర మ్ తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ సబ్-డివిజన్ క్రైమ్ బ్రాంచ్ కు 4 రివార్డులు అందించిన విశాఖ సిటీ కమిషనర్

## చోరీ నగలు రికవరీ చేసి బాధితులకు అప్పగించినందుకు పోలీసు సిబ్బందికి సర్వత్ర హర్షం




**గాజువాక :పెన్ పవర్,సెప్టెంబర్ 29** :నేరాల నియంత్రణ, కేసుల సమర్థవంతమైన దర్యాప్తు మరియు ప్రజలు పోగొట్టుకున్న విలువైన వస్తువులను తక్కువ సమయంలోనే గుర్తించి రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో విశాఖపట్నం సిటీ పోలీస్ సౌత్ సబ్–డివిజన్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు మరియు సిబ్బంది చూపుతున్న ప్రతిభను ఉన్నతాధికారులు అభినందించారు.
ఈ సందర్భంగా విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంకరబ్రత బక్షి, ఐ పి ఎస్ , డీసీపీ లతా మాధురి చేతుల మీదుగా, అధిక సంఖ్యలో కేసులను సమర్థవంతంగా పరిశోధించి, పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో విశేష ప్రతిభ కనబరిచిన సౌత్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు , ఎస్సై హరికృష్ణకు మొత్తం 4 రివార్డులు అందజేశారు . కేసులు నమోదైన అనంతరం వాటిని తక్కువ సమయంలోనే శాస్త్రీయ పద్ధతుల్లో, సమర్థవంతంగా పరిశోధించి నిందితులను గుర్తించడం, పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను రికవరీ చేయడం మరియు వాటిని బాధితులకు తిరిగి అప్పగించడం ద్వారా సౌత్ సబ్–డివిజన్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు మరియు సిబ్బంది ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తున్నారు.ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడుతూ, సౌత్ సబ్–డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది సమన్వయంతో, సమిష్టి కృషితో విధులు నిర్వహించడం వల్లనే ఇటువంటి మంచి ఫలితాలు సాధ్యమవుతున్నాయని అభినందించారు. పోలీసు అధికారులు మరియు సిబ్బంది ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహిస్తూ ప్రజల శ్రేయస్సు, భద్రత మరియు న్యాయం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.
ప్రజలు తమ విలువైన వస్తువులను పోగొట్టుకున్న సందర్భాల్లో వాటిని తిరిగి రికవరీ చేసి బాధితులకు అందించడమే కాకుండా, నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతూ ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సౌత్ సబ్–డివిజన్ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది నిరంతరం సేవలందిస్తున్నారు.ఈ రివార్డులు సౌత్ సబ్–డివిజన్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు మరియు సిబ్బంది సమిష్టి కృషికి లభించిన గుర్తింపుగా అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఉన్నతాధికారులు ఆకాంక్షించారు.

# వైఎన్ పాకలు ఆశ్రమ పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నిక-చైర్మన్‌గా సమిరెడ్డి విజయ్

**కొయ్యూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**కొయ్యూరు మండలం వైఎన్ పాకలు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీతాంజలి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. చేతులెత్తే పద్ధతిలో నిర్వహించిన ఎన్నికల్లో జీకేవీధి గ్రామానికి చెందిన సమిరెడ్డి విజయ్ అత్యధిక మద్దతుతో ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా కుమారి ఎన్నికైనట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా నూతన చైర్మన్ సమిరెడ్డి విజయ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థినులకు అవసరమైన వసతి సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను




ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అగనంపూడి లో విద్యుత్ సమస్యల పై గళం మెత్తిన నాయకులు

**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,సెప్టెంబర్ 29** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో అగనంపూడి లో విద్యుత్ సమస్యల పైన కూటమి నాయకులు అగనంపూడి ఏపీఈపీడీసీఎల్ అధికారుల కు వివరించారు . ఏఈ కి వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా ఏఈ గారు మాట్లాడుతూ చిన్న చిన్న ప్రాబ్లమ్స్ వలన తుఫాను వలన అంతరాయం జరిగింది తప్ప కరెంటు పోలేదని ఇకపైన ఎటువంటి ప్రాబ్లం రాకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు గవర సోమశేఖర్, బిజెపి అధ్యక్షులు కోసూరు తాతారావు, సీనియర్ నాయకులు గంతకోరు అప్పారావు, హాస్పిటల్ డైరెక్టర్ డొక్కా రమేష్ గారు, మాజీ హాస్పిటల్ చైర్మన్ కొర్రాయి జగదీష్, సీనియర్ నాయకులు గొల్లవిల్లి కమాండో నూకరాజు, గల్లా రుద్ర కుమారు, గొడ్డి గురుమూర్తి, వార్డు మహిళా అధ్యక్షురాలు గీత అన్నపూర్ణ,గాజువాక మహిళా ఉపాధ్యక్షురాలు గంతకోరు సత్యవతి, జనసేన వీర మహిళ సన్నీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీ ఎస్ఎంసీ చైర్మన్‌గా లకే ఈశ్వరమ్మ వైస్ చైర్మన్‌గా మాదిరి నిర్మల కుమారి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దేరాలలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) నూతన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్‌గా లకే ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్‌గా మాదిరి నిర్మల కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినుల తల్లిదండ్రుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. నూతన కమిటీ పాఠశాల అభివృద్ధి, విద్యార్థినుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ పనిచేయాలని నిర్ణయించింది.చైర్మన్‌గా లకే ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్‌గా మాదిరి నిర్మల కుమారి ఎన్నిక కావడంతో పాఠశాల ప్రిన్సిపాల్ గొర్లె లావణ్య సరస్వతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రులు వారికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పాఠశాల విద్యా ప్రమాణాల మెరుగుదలకు శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గొర్లె లావణ్య సరస్వతి, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 87వ వార్డులో మల్టీపర్పస్ ఓపెన్ షెడ్ ప్రారంభోత్సవం



**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,సెప్టెంబర్ 29** మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డు పరిధిలో టీజిఅర్ నగర్ లో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ ఓపెన్ సెట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు , గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు , మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటు అభివృద్ధి చేస్తూ సంక్షేమ పథకాలు అందిస్తుందని.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ దశల వారీగా అమలు చేసుకుంటూ వస్తున్నట్లు తెలిపారు.పారదర్శక పాలన అందించడమే కూటమి ముఖ్య ఉద్దేశ్యమన్నారు .ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం మాట్లాడుతూ శ్రీ విజయ గణపతి వడ్డెర సేవ సంఘం వారిని దృష్టిలో పెట్టుకొని మల్టీ పర్పస్ ఓపెన్ షెడ్ నిర్మించామని ప్రజలు వివాహాలు, సమావేశాలు మరియు సామాజిక కార్యక్రమాల కోసం ఈ మల్టీపర్పస్ ఓపెన్ ను వినియోగించుకోవాలని అన్నారు అనంతరం శ్రీ విజయ గణపతి వడ్డెర సొసైటీ సంఘం ఆధ్వర్యంలో శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు కి బొండా జగన్ కి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రసాదుల శ్రీను,వార్డు అధ్యక్షుడు విజయరామరాజు, మాజీ కార్పొరేటర్ మొల్లు ముత్యాలు,సెక్రటరీ బొట్టా ప్రకాష్, మాజీ కార్పొరేటర్ గొర్లె వెంకీ నాయుడు, వై భాస్కరరావు, ఈర్ల దేముడు, కడుపుట్ల శ్రీను, దాలయ్య,జాన్ రమేష్,కళ్యాణ్ చక్రవర్తి, భీముడు ,సింహాద్రి, వెంకటేష్,సన్యాసిరావు గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పిల్లలకు కష్టం విలువ తెలిసేలా పెంచాలి-జీకేవీధి ఎస్సై సురేశ్




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**పిల్లలను గారాబంగా పెంచడం కంటే తల్లిదండ్రులు పడుతున్న కష్టం, శ్రమ విలువ తెలిసేలా పెంచినప్పుడే వారు భవిష్యత్తులో ప్రయోజకులుగా ఎదుగుతారని జీకేవీధి ఎస్సై సురేశ్ అన్నారు.మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము పడిన కష్టాలను తమ పిల్లలు పడకూడదనే ఉద్దేశంతో వారు అడిగిన ప్రతిదీ సమకూర్చడం వల్ల పిల్లలకు కష్టం విలువ తెలియకుండా పోయే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూనే, బాధ్యత, క్రమశిక్షణ, శ్రమ విలువను కూడా నేర్పాలని సూచించారు.ముఖ్యంగా విద్యార్థినులు సెల్‌ఫోన్లకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, అవసరానికి మించి ఫోన్లు ఇవ్వడం వల్ల చదువుపై ప్రభావం పడే అవకాశం ఉందని సూచించారు. పిల్లల విద్య, భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.ఈ సమావేశంలో ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు, కేజీబీవీ ప్రిన్సిపల్ గొర్లె లావణ్య సరస్వతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# 13వ వార్డులో 522 మందికి పట్టాలు, దస్తావేజుల పంపిణీ

**ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు చేతుల మీదుగా అందజేత**

**విశాఖ తూర్పు పెన్ పవర్, సెప్టెంబర్ 29:**విశాఖ తూర్పు నియోజకవర్గం 13వ వార్డు అరిలోవ చివరి బస్టాప్ వద్ద గల క్రిస్టియన్ కళ్యాణ మండపంలో 522 మంది లబ్ధిదారులకు కన్వేయన్స్ దస్తావేజులు, పట్టాలను ఎమ్మెల్యే శ్రీ వెలగపూడి రామకృష్ణ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2016-17లో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన చంద్రన్న పట్టాలకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం పూర్తి ఆస్తి హక్కు కల్పిస్తూ దస్తావేజులు ఇస్తోందన్నారు. జీవో 30 కింద 150 గజాల వరకు ఉన్న అర్హులకు కూడా ఉచిత పట్టాలు ఇస్తున్నామని, అర్హులు వీఆర్వోను కలవాలని సూచించారు. చివరి అవకాశం 30న:పత్రాలు తీసుకోని 93 మంది, పట్టాలు తీసుకోని 37 మందికి ఈ నెల 30న మంగళవారం తోటగరువు రాధాకృష్ణ కళ్యాణ మండపంలో చివరి అవకాశంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్ కిరణ్, మాజీ కార్పొరేటర్లు ఒమ్మి సన్యాసిరావు, కెల్లా సునీత, నాయకులు ఏడువాక సన్యాసిరావు,పాత్రకండ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



## 650 కుటుంబాలకు శాశ్వత ఆస్తి హక్కు పత్రాలు

**పట్టాల రిజిస్ట్రేషన్ మంజూరుపై ప్రభుత్వ విప్ గణబాబుకు కృతజ్ఞతలు**



**ములగాడ, పెన్ పవర్ సెప్టెంబర్ 29 :**జీవో నంబర్ 296, శాశ్వత రిజిస్ట్రేషన్ 30 ప్రకారం 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాలు, శా శ్వత రిజిస్టర్డ్ ఆస్తి పత్రాలు మంజూరు చేయడం పై కాలనీవాసులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ఏ యూ మైదానంలో నిర్వహించిన 'పేదలకు పట్టా భిషేకం -- మీ ఇల్లు మీ హక్కు' కార్యక్రమంలో పత్రాలు అందుకోలేకపోయిన హిమాచల్‌నగర్ లబ్ధిదారులకు మంగళవారం ప్రభుత్వ విప్ గణ బాబు ఆస్తి పత్రాలను అందజేశారు. ఈ సంద ర్భంగా కాలనీవాసులు ముందుగా పట్టాలు మం జూరు చేసినందుకు గణబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మిగిలిన అర్హులందరికీ పట్టాలు మంజూరు చేయడంతో పాటు కాలనీ లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని గణబాబును కోరారు. దీనిపై ఆయన సాను కూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సహకరించిన కూటమి కోఆర్డి నేటర్ విశ్వనాధుల దినకర్‌కు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సీహెచ్ రామ్మో హన్ నాయుడు, వార్డు ప్రధాన కార్యదర్శి మిత్తి రెడ్డి శంకర్, పశ్చిమ తెలుగు యువత అధ్యక్షు డు గుణ అనిల్, హిమాచల్‌నగర్ ఐక్యత యూ త్ కూటమి నాయకులు, కార్యకర్తలు తదిత రులు పాల్గొన్నారు. 58, 59వ వార్డుల పరిధిలోని నక్కవానిపాలెం, ఎదురువానిపాలెం ప్రాంతాలకు చెందిన సుమా రు 650 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు శాశ్వత రిజిస్టర్డ్ ఆస్తి పత్రా లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ములగాడ మండల తహసీ ల్దార్, రెవెన్యూ అధికారులు, వార్డు కార్యకర్తలు, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదా రులు పాల్గొన్నారు.

### చింతపల్లి జెడ్పీ హైస్కూల్ ఎస్ ఎం సి చైర్మన్ గా వి. పరమేశ్వరరావు.



**చింతపల్లిపెన్ పవర్ సెప్టెంబర్ 29.**చింతపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ ఎం సి ) నూతన ఎన్నిక సోమవారం ఘనంగా జరిగింది. ఉపాధ్యాయులు, మండల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో అధికారులు ఈ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికలో వి. పరమేశ్వరరావు రెండవసారి ఎస్ ఎం సి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్ గా పోలేజీ విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ వి. పరమేశ్వరరావు మాట్లాడుతూ. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. నాకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, సక్రమంగా నిర్వహిస్తాను. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాను అని ఆయన ఆయన అన్నారు.

## ద్వారకా బస్‌స్టేషన్‌లో స్వచ్ఛతా కార్యక్రమం




**విశాఖ దక్షిణం, పెన్ పవర్ సెప్టెంబర్ 29 :**ఏపీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వ చ్ఛతా కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం లోని ద్వారకా బస్‌స్టేషన్‌లో మంగళవారం శుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. రీజినల్ మేనేజర్ శ్రీ బి. అప్పలనాయుడు ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, విద్యార్థులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది బస్ స్టేషన్ పరిసరాలను శుభ్రపరిచారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు కొన సాగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల్లో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమా లను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్‌కు చెందిన విద్యార్థులు, అధికారులు ప్రయాణికులు, విద్యా ర్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. బస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రం గా ఉంచడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, స్వ చ్ఛత పాటించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్ మెంట్ జనరల్ మేనేజర్ విజయ్ కుమార్, మేనేజర్ మూర్తి, శ్రీ జే. తిరుపతిరావు, స్టేషన్ మేనేజర్ కే.కే. రావు తదితర అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు. ం

## విశాఖ విమల విద్యాలయంను ప్రభుత్వ పాఠశాల గుర్తించాలని కోన తాతారావుకి వినతి



**గాజువాక :పెన్ పవర్ ,సెప్టెంబర్ 29** పారిశ్రామిక ప్రాంతం పెదగంట్యాడ మండలం పరిధిలో, విశాఖ ఉక్కు నిర్వాసిత ప్రాంతంలో సుమారు 13 ఎకరాల స్థలంలో, అన్ని వసతులు కలిగిన ఈ పాఠశాలను ప్రస్తుతం స్టీల్ యాజమాన్యం పర్యవేక్షణలో పనిచేస్తుంది అని, అతి కొద్ది రోజులలో ఒప్పందం పూర్తి కానుందున, పెదగంట్యాడ విశాఖ విమల విద్యాలయం పాఠశాలను కూడా ప్రభుత్వ పాఠశాలగా మార్చాలని, ప్రస్తుతం ఫీజులు వసూలు చేయడం వలన స్థానిక విద్యార్థిని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ పాఠశాలలో కాంట్రాక్ట్ నిర్వాసిత కార్మికులు పిల్లలు, గంగవరం పోర్టు కార్మికుల పిల్లలు చుట్టుపక్కల పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే ఒప్పంద కార్మికులు, నిరుపేద కుటుంబానికి చెందినవారు ఎక్కువగా ఉండటం వలన వారికి ఆర్థిక భారంగా మారినది. ఇంత పెద్ద సువిశాల పాఠశాలను, ప్రభుత్వ పాఠశాలగా మార్చాలని , సమస్యను ప్రభుత్వానికి తెలియజేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోన తాతారావు మాట్లాడుతూ, ఈ సమస్యపై పూర్తి అవగాహన ఉందని, గతంలో స్థానిక కార్పొరేటర్ గా 51 వ వార్డు ఉన్నప్పుడు స్కూల్ అభివృద్ధికి అన్ని విధాల సహకరించానని, ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ ఆర్థిక సమస్య కారణంగా కొంతమంది ఉపాధి కోల్పోవడం, వారి పిల్లల చదువుకు ఇబ్బందులు పడడం నా వద్దకు వచ్చిందని, విశాఖ విమల విద్యాలయం ఉక్కునగరం పాఠశాలను ప్రభుత్వపరం చేశారో, అదే విధంగా ఈ పాఠశాలను కూడా ప్రభుత్వ పరం చేసేలా, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్థానిక గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు , విశాఖ జిల్లా ఎంపీ శ్రీ భరత్ కి తెలియజేస్తామని, స్టీల్ ప్లాంట్ యాజమాన్యంతో కూడా మాట్లాడి, త్వరలోనే పాఠశాల ప్రభుత్వ పాఠశాలగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న విద్యార్థిని విద్యార్థులకు అండగా ఉంటుందని, తప్పకుండా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు గారు, ఉపాధ్యాయులు సూర్య ప్రతాప్, మధు నాయుడు, నాయుడు, రమణ, స్థానిక నాయకులు, ఉరుకుటి రమణయ్య, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## 64, 65, 74 వార్డులో లబ్ధిదారులకి ఇల్లు పట్టాలు పంపిణీ

**గాజువాక :పెన్ పవర్ ,సెప్టెంబర్ 29** విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం 64, 65, 74 వార్డులో గల లబ్ధిదారులకి ఇల్లు పట్టాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మాజీ కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి సభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు, డి.సి.సి. బి చైర్మన్ కోన తాతారావు, గాజువాక బీజేపీ కన్వీనర్ కే.ఎన్.ఆర్ ప్రభుత్వ అధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతుల మీదగా మహిళలకు ఇల్లు పట్టాలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. సెప్టెంబర్ 19 న ఇంజనీరింగ్ కాలేజీలో సీఎం చంద్రబాబు 29 వేల మందికి పట్టాలు అందజేశారని, అర్హులైన అందరికీ పట్టాలివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని, త్వరలో టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు.



నియోజకవర్గంలో పెండింగ్ లోని దరఖాస్తుదారులకు త్వరలో పట్టాలు ఇచ్చేలా చర్యలను తీసుకుంటామని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో గాజువాక టిడిపి సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు పులి రమణారెడ్డి, ములకలపల్లి వెంకటయ్య, మొల్లి పెంటిరాజు, అధికారులు, కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అడవివరం గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్లకు కదలిక



- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో సమస్య పరిష్కార మార్గం
- త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులు
- విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ హామీ

**సింహాచలం, పెన్ పవర్, సెప్టెంబర్ 29 :** జీవీఎంసీ 98వ వార్డు అడవివరం గ్రామ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కార దిశగా అడుగులు పడుతున్నాయి. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో ఈ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చినట్లు 98వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ పి.వి. నరసింహం తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జారీ అయిన జీవో నంబర్ ఎం.ఎస్. 297 నేపథ్యంలో అడవివరం గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్ సమస్యపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌తో సంప్రదించినట్లు ఆయన పేర్కొన్నారు. అడవివరం గ్రామకంఠం భూములను 22(1)(సి) పరిధి నుంచి తొలగించి, మిగిలిన నాలుగు గ్రామాల్లో ఏ విధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందో అదే విధంగా అడవివరం గ్రామ ప్రజలకు కూడా రిజిస్ట్రేషన్లు జరిగేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మెల్యే కోరినట్లు తెలిపారు. ఈ అంశంపై జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అవసరమైన ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు పి.వి. నరసింహం వెల్లడించారు. గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారమైతే ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అడవివరం గ్రామ ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా అడవివరం గ్రామ ప్రజల తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు పి.వి. నరసింహం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు జీకేవీధిలో వైఎస్‌ఆర్‌సీపీ సమావేశం

**స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం.. ఐడీ కార్డుల పంపిణీ**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**జీకేవీధి మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 9 గంటలకు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ తెలిపారు. స్థానిక ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంతో పాటు పార్టీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాడేరు ఎమ్మెల్యే, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు కార్యక్రమానికి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల పార్టీ పదాధికారులు, 16 పంచాయతీల పార్టీ అధ్యక్షులు, బీఎల్ఏలు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్లు, మాజీ ఏఎంసీ డైరెక్టర్లు, మాజీ వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## విమ్స్ లో ఘనంగా ప్రపంచ గుండె దినోత్సవం




**పెన్ పవర్, సెప్టెంబర్ 29:** గుండె ఆరోగ్యంపై అవగాహన ముఖ్యమన్న డైరెక్టర్ డాక్టర్ వి మన్మధరావు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో ప్రపంచ గుండె దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ డా. వి. మన్మధరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె ఆరోగ్యం ప్రతి ఒక్కరికీ ముఖ్యమని, జీవనశైలిలో మార్పులు, క్రమం తప్పని వ్యాయామం, సమతుల్య ఆహారం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం ద్వారా గుండె జబ్బులను నివారించవచ్చన్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

విమ్స్ లో గుండె రోగులకు అత్యాధునిక సదుపాయాలతో నాణ్యమైన సేవలు అందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్డియాలజీ వైద్యులు నివారణ, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుగీత స్వర్ణలత, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా. మనోజ్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేవస్థాన పాలక మండలిలో నాయి బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం

**సవరపు పద్మ శ్రీను ప్రమాణ స్వీకారం**

**విశాఖపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 29 :** నగరంలోని వన్‌టౌన్ 38వ వార్డులో ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి మరియు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా సవరపు పద్మ శ్రీను ప్రమాణ స్వీకారం చేశారు. దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాలక మండలి సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారం అనంతరం సవరపు పద్మ శ్రీనును విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం (రిజి. నెం.500/82) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటా నరేష్, జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కోడూరు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు, అదనపు కోశాధికారి మల్లువలస వర్మ, అధికార ప్రతినిధి బల్లంకి వెంకట్రావు, దక్షిణ నియోజకవర్గ అధ్యక్షులు చల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవస్థానాల పాలక మండళ్లలో నాయి బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ అవకాశాలు కల్పిస్తున్నందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. దేవస్థానాల పాలక మండళ్లలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సామాజిక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. శ్రీ భీమేశ్వర స్వామి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన అభివృద్ధికి పాలక మండలి సభ్యులు సమన్వయంతో పనిచేయాలని వారు ఆకాంక్షించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సవరపు పద్మ శ్రీనుకు పలువురు నాయి బ్రాహ్మణ



సంఘం నాయకులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

# యువత భవిష్యత్తుకు బాబు భరోసా






- బాబు విజన్‌తోనే యువతకు బంగారు భవిత
- 'యువతకు భరోసా' టౌన్‌హాల్‌లో ప్రభుత్వ విప్ గణబాబు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 29 :** రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని, యువత ఉజ్వల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, పాలన భరోసాగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. 'యువతకు భరోసా' కార్యక్రమంలో భాగంగా విశాఖ నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల, మహతి డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన టౌన్‌హాల్ ముఖాముఖి కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి కెరీర్ ఆకాంక్షలు, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో హైదరాబాద్‌లో ఐటీ రంగానికి ప్రాధాన్యత ఇచ్చారని, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల రాకకు అనుకూల వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. హైటెక్ సిటీ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్ అభివృద్ధిలో కీలకంగా మారాయని అన్నారు. అదే తరహాలో విశాఖపట్నాన్ని అంతర్జాతీయ స్థాయి ఐటీ, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో గూగుల్ వంటి ప్రముఖ సంస్థలతో పాటు ఫార్చ్యూన్-500 స్థాయి బహుళజాతి సంస్థలను విశాఖకు ఆకర్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఉద్యోగాల కోసం విశాఖ యువత ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నగరంలోనే నాణ్యమైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని గణబాబు అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ కారిడార్లు, పారిశ్రామిక ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధితో విశాఖ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు డిగ్రీ పూర్తయ్యే నాటికి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను సంపాదించుకోవాలని సూచించారు. కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ నాలెడ్జ్, ప్రాక్టికల్ స్కిల్స్, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్, ఆటోమేషన్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు వేగంగా విస్తరిస్తున్నాయని గణబాబు అన్నారు. వైద్యం, ఇంజినీరింగ్, డిజైనింగ్, విద్య, పరిశ్రమలు, సేవారంగం తదితర అన్ని రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా మారుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఉద్యోగ మార్కెట్‌లో మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. 'విజన్-2047' లక్ష్యాలకు అనుగుణంగా భారతదేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. విశాఖపట్నంలో గతంతో పోలిస్తే మౌలిక వసతులు గణనీయంగా అభివృద్ధి చెందాయని గణబాబు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, పర్యాటక రంగం, ఐటీ రంగం అభివృద్ధి చెందితే స్థానికంగా యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. నగర అభివృద్ధి కేవలం రోడ్లు, భవనాల నిర్మాణానికి పరిమితం కాకుండా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, జీవన ప్రమాణాల మెరుగుదలకు దారితీయాలని తెలిపారు. ఉద్యోగాలు, యువత భవిష్యత్తు వంటి అంశాలపై రాజకీయ ప్రయోజనాల కోసం జరిగే ప్రచారాలను విద్యార్థులు జాగ్రత్తగా పరిశీలించాలని గణబాబు సూచించారు. తమ భవిష్యత్తు లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగాలని, నైపుణ్యాభివృద్ధి ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు గణబాబు సమాధానాలు ఇచ్చారు. కెరీర్ ఎంపిక, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు సంబంధించిన అంశాలపై విద్యార్థులతో ఆయన చర్చించారు. కార్యక్రమాల్లో ఆదిత్య, మహతి డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక బృందం, కళాశాల సిబ్బంది, భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్ విజయాలకు గణబాబు శుభాకాంక్షలు తెలిపారు.

## కేజీబీవీ ఎస్ఎంసీ చైర్మన్‌గా పావని



**ఆనందపురం: పెన్ పవర్, సెప్టెంబర్ 29,** లోడగలవానిపాలెం పంచాయతీ పరిధిలోని నేల్తేరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్, ఎస్ఎంసీ కన్వీనర్ దొండా చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా కొప్పల పావని, వైస్ చైర్మన్‌గా గొంప వరం ఎన్నికయ్యారు.
తల్లిదండ్రుల నుంచి 13 మంది, ఉపాధ్యాయ ప్రతినిధులుగా బి.నాగమణి, కేటీఎస్ ప్రసాదాని, నామినేటెడ్ సభ్యులుగా అక్కిరెడ్డి దేవుడు బాబు, స్థానిక ఏఎన్ఎం ఎన్నికయ్యారు. నూతన కమిటీ పాఠశాల అభివృద్ధి, విద్యార్థినుల విద్యా ప్రమాణాల మెరుగుదల, వసతుల కల్పనకు కృషి చేయాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి..!!

ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు




**ఆనందపురం. పెన్ పవర్, సెప్టెంబర్ 29:** ప్రస్తుత రోజుల్లో చిన్న వయసులోనే గుండె జబ్బులకు గురై మరణాలు సంభవిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు సూచించారు.
ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేములవలస జోనల్ కార్యాలయం వద్ద మదర్ తెరిసా విగ్రహానికి పూలమాల వేసి ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని, మద్యం, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.
సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి మాట్లాడుతూ గుండె జబ్బుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు.
కార్యక్రమంలో జోనల్ సలహాదారు కోన ప్రకాష్, కోశాధికారి పచ్చిపులుసు కనకారావు, ఆనందపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పడాల కోటేశ్వరరావు, ప్రచార కార్యదర్శి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన పల్లెల్లో మౌలిక వసతులు కల్పించాలి



**ఎంపీడీవోకు జనసేన నాయకుల వినతి**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరిస్తేనే గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జనసేన పార్టీ నాయకులు అన్నారు. 'పల్లె పండగ 3.0' కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం గూడెంకొత్తవీధి మండల జనసేన నాయకులు ఎంపీడీవో బిహెచ్వి రమణ బాబును కలిసి గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గిరిజన పల్లెల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీ, రక్షిత తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ప్రజల కనీస అవసరాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులను గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో వినియోగించాలని కోరారు. 'పల్లె పండగ 3.0'లో భాగంగా గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మాజీ సర్పంచ్ పాంగి వంశీకృష్ణ, సీనియర్ నాయకులు గుంట కోటి, గెమ్మెలి పాల్స్, పాంగి కృష్ణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎస్ఎంసి ఎన్నికలు



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 29.** ముంచంగిపుట్టు మండల వ్యాప్తంగా ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు మండల విద్యాశాఖ సిబ్బంది పేర్కొన్నారు. ఎన్నికలు జరిగిన రోజునే సభ్యులతో పాటు ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌లను ఎన్నుకుని తొలి సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ చాలా పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగినట్లు విద్యాశాఖ ప్రకటించింది. లబ్బూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన ఎస్ఎంసి ఎన్నికలో చైర్ పర్సన్ గా కిముడు రాంబాబు ఎన్నుకోబడగా వైస్ చైర్ పర్సన్ గా సిహెచ్ వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీని ప్రిన్సిపాల్ ప్రమాణస్వీకారం చేయించారు.

## కిడ్నీ సమస్యతో బాధపడుతున్న విద్యార్థికి డాక్టర్ వంపూరు గంగులయ్య భరోసా




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మాడెం గ్రామానికి చెందిన విద్యార్థి వంతల ప్రదీప్ కుమార్‌ను జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర జానపద కళలు--సృజనాత్మక అకాడమీ చైర్మన్ డా. వంపూరు గంగులయ్య సోమవారం పరామర్శించారు. దామనపల్లి పర్యటనలో భాగంగా మాడెం గ్రామానికి వెళ్లిన ఆయన ప్రదీప్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వైద్య చికిత్సకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించేందుకు అవసరమైన రవాణా ఖర్చులు కూడా కుటుంబానికి భారంగా మారాయని వారు గంగులయ్య దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన గంగులయ్య బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ప్రదీప్ కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించేందుకు అవసరమైన రవాణా ఖర్చులకు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే వైద్యపరమైన సహాయం అందేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని కుటుంబ సభ్యులకు తెలిపారు. విద్యార్థి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన గంగులయ్య, వైద్యం విషయంలో కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తమ సమస్యను స్వయంగా తెలుసుకుని సహాయం అందిస్తామని హామీ ఇచ్చినందుకు ప్రదీప్ కుమార్ కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిదరి రామమూర్తి, గూడెంకొత్తవీధి మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వసుపరి ప్రసాద్, కొయ్యం ఇమ్మానుయేల్, సిద్దు, గబులంగి గణేష్, గడుతూరి రమణబాబు, వంశీ, శ్రీను, ఈశ్వర్, గడుతూరి పరమేశ్వరరావు, మదల సతీష్, సిదరి రమణమూర్తి, వెంకటేశ్వర్లు, కూడా పల్లంనాయుడు, వంతల కాశీరాజు, సూర్ల వీరేంద్ర, కూడా రామకృష్ణ, చల్లంగి శ్రీను, దాసు, బురిడీ సరస్వతిరావు, కిముడు సాధురం, కొర్ర రాంబాబు, పాంగి దాసు, సుందర్, తగ్గి బాలరాజు, భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా గ్రామం.. మార్క్ వైద్యానికి రూ.40వేల చేయూత మానవత్వమే మహోన్నత సేవ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** ఊపిరితిత్తుల సమస్యతో అనారోగ్యానికి గురై విశాఖపట్నంలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుంట బింగు కుమారుడు గుంట మార్క్‌కు గ్రామస్తులు ఆపదలో అండగా నిలిచారు. మార్క్ వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం తెలుసుకున్న గూడెం కాలనీ గ్రామ ఉద్యోగులు, మహిళలు, యువకులు, పెద్దలు స్పందించారు. తమ వంతు సహాయంగా చేయి చేయి కలిపి రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని సేకరించారు. సేకరించిన మొత్తాన్ని గ్రామ యువకులు సేవ ప్రేమ్‌కుమార్, నాడెలి సాయి విశాఖపట్నంలోని కేర్ ఆస్పత్రికి వెళ్లి మార్క్ కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం కొంత ఊరటనిచ్చింది. ఆపద సమయంలో స్పందించి ఆర్థిక సహాయం అందించిన గ్రామస్తుల సేవా స్ఫూర్తిని పలువురు అభినందించారు.

## వైఎన్ పాకలు ఆశ్రమ పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నిక

చైర్మన్‌గా సమిరెడ్డి విజయ్




**కొయ్యూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** కొయ్యూరు మండలం వైఎన్ పాకలు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీతాంజలి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. చేతులెత్తే పద్ధతిలో నిర్వహించిన ఎన్నికల్లో జీకేవీధి గ్రామానికి చెందిన సమిరెడ్డి విజయ్ అత్యధిక మద్దతుతో ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా కుమారి ఎన్నికైనట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా నూతన చైర్మన్ సమిరెడ్డి విజయ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థినులకు అవసరమైన వసతి సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

జోన్--3 మధురవాడ డివిజనల్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాస్




**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 29 :** కార్మికుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తన పరిధిలో అన్ని విధాలా సహకరిస్తానని జోన్--3 మధురవాడ డివిజనల్ ఇంజినీర్ (డిఈ) పోలాకి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. నూతనంగా జోన్--3 మధురవాడ డివిజనల్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఏఈసిఈఏ--జి--3045 యూనియన్ ప్రతినిధులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు డివిజన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను డిఈ పోలాకి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులకు ఎదురవుతున్న ఇబ్బందులు, ఉద్యోగ భద్రత, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. కార్మికుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, అవకాశం ఉన్నంతవరకు వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు. ఆనందపురం సెక్షన్ పరిధిలోని వెల్లంకి సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడి మృతిపై డివిజనల్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి డిపార్ట్‌మెంట్ నుంచి అందాల్సిన ఇన్సూరెన్స్, ఈపిఎఫ్, ఈఎస్ఐ తదితర ప్రయోజనాలకు సంబంధించిన వివరాలను పరిశీలించి, అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాల విషయంలో సంబంధిత అంశాలను తన పరిధిలో పరిశీలిస్తానని తెలిపారు. విద్యుత్ శాఖలో విధులు నిర్వహించే ప్రతి కార్మికుడు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డిఈ శ్రీనివాస్ సూచించారు. విద్యుత్ పనుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా, నిర్దేశించిన సేఫ్టీ ప్రొటోకాల్‌ను పాటించాలని స్పష్టం చేశారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈసిఈఏ--జి-3045 యూనియన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడుల సదస్సుకు సన్నాహాలు ముమ్మరం

**ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 29 :** విశాఖపట్నం గంభీరం ఐఐఎం ప్రాంగణంలో అక్టోబర్ 7న నిర్వహించనున్న రీజనల్ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సమ్మిట్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీ లించారు.జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆర్డీవో సంగీత్ మాధుర్, ఏపీఐఐసీ, ఈడీబీ, పరి శ్రమల శాఖలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సమ్మిట్ ప్రాంగణా న్ని పరిశీలించారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబ డిదారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, ప్రభు త్వ శాఖల అధికారులు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సమ్మిట్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా వేదిక, సమావేశ ప్రాంగణం, అతిథుల రాక పోకలు, పార్కింగ్, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అనంతరం ఐఐఎం గంభీరం ప్రాంగణంలో ఇప్పటివరకు చేపట్టిన ప్రాథమిక ఏర్పాట్లను అధికా రులు కలెక్టర్‌కు వివరించారు. సమ్మిట్ విజయ వంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## అధ్వానంగా కంటారం రహదారి...!



**పాఠశాల విద్యార్థుల అవస్థలు...**

**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 29:** కొయ్యూరు మండలం కంటారం పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారి బురదమయంగా మారి విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వర్షాలకు రహదారి పూర్తిగా దెబ్బతిని బురద గుంటలుగా మారింది. పాఠశాలకు వెళ్లే చిన్నారులు సైకిళ్లపై, కాలినడకన వెళ్లలేక నరకయాతన పడుతున్నారు. ఈ రహదారిపై వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.జనసేన పార్టీ కంటారం పంచాయతీ అధ్యక్షుడు గంటా శివాజీ ఆధ్వర్యంలో స్థానికులు, విద్యార్థులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వెంటనే ఈ రహదారిని మరమ్మతులు చేయాలని, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించాలని గంటా శివాజీ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కొత్తపేటలో ఏకగ్రీవంగా ఎస్ఎంసీ కార్యవర్గాల ఎంపిక



**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**కొత్తపేట పంచాయతీ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్లు, వైస్‌చైర్మన్ల ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనలో కమిటీలు సమన్వయంతో పనిచేయాలని పలువురు సూచించారు.కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా పాలంగి శివ, వైస్‌చైర్మన్‌గా వర్ర అనంతలక్ష్మి ఎంపికయ్యారు. బాలికల ఉన్నత పాఠశాల చైర్మన్‌గా వాసంశెట్టి వీర వేణి, వైస్‌చైర్మన్‌గా చింతపల్లి సూరిబాబు ఎన్నికయ్యారు.గోగివారిపేటకు గుమ్మడి రాజి--ఉందుర్తి కృష్ణప్రసాద్, పెదరాముడునీతిమేరకకు యనమదల కనకరాజు--సానబోయిన ఆశ, పెద్దగుళ్లపాలెంకు దునబోయిన భవాని--వాసంశెట్టి మేరీ, రెడ్డప్పవారిపేటకు నక్క సత్యనారాయణ--అంబటి చిన్నారి, చిన్నగుళ్లపాలెంకు కముజు రాజేశ్వరి--కడలి సుబ్బలక్ష్మి ఎంపికయ్యారు.మద్దులమేరకకు చేట్ల రవికుమార్--గోడేల విజయలక్ష్మి, గౌతమినగర్‌కు మట్టపర్తి కృష్ణ--గాడ శాంతి, గణేష్ కాలనీకి షేక్ ఆశ--గాడ సునంద, పనసలదొడ్డికి పేచ్చెట్టి సత్తిబాబు--భోగిశెట్టి లక్ష్మి, కమ్మిరెడ్డిపాలెంకు మలకా రాజకుమారి--తిరిగి సాయిమణి, కమ్మిరెడ్డిపాలెం మెయిన్‌కు చీకట్ల నరసదేవి--అస్లాం ఎంపికయ్యారు. బండారుపేటకు కాగిత బాబుజి--కోణాల దేవి, శ్రీనివాసపేటకు గంటి అంజిబాబు--మెట్టి గంగాభవాని, పాత రామాలయం అగ్రహారం వీధికి వైద దుర్గాభవాని--బుక్కే మధులత, పాత రామాలయానికి సలాది దుర్గ--పాలంగిర్ నారాయణమూర్తి, బి.సవరం పాఠశాలకు మాచిరెడ్డి పద్మావతి--శీలం గంగాభవాని, ఏనుగుమహల్‌కు కాకర ఝాన్సీరాణి--కంచిమర్తి భవాని ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.కొత్తగా ఎంపికైన ఎస్ఎంసీ కార్యవర్గాలకు తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి నాయకులు అభినందనలు రుతెలిపారు. పాఠశాలల సమస్యలను గుర్తించి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థుల ప్రయోజనాల కోసం కమిటీలు పనిచేయాలని వారు ఆకాంక్షించారు.

## జగ్గంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతా



**ఎమ్మెల్యే నెహ్రూ**

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** జగ్గంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమం మంగళవారం జగ్గంపేట నియోజకవర్గంలో నిర్వహించారు. ఎమ్మెల్యే నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని జగ్గంపేట శెట్టిబలిజిపేటలో భావారం ఫిల్టర్ వాటర్ స్కీం నుండి శుద్ధి చేసిన సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన 3 జిఎల్ఆర్ ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గోకవరం రోడ్డులోని బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలకు మెయిన్ రోడ్డు నుండి రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 11 వేల కోట్ల రూపాయలతో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి జాతర జరుగుతోందని అన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, అడపా భరత్, రాష్ట్ర డైరెక్టర్లు పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, గెద్దాడ సత్యవేణి, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, మారిశెట్టి భద్రం, కన్నబాబు, కందుల చిట్టిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి,పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, ఎస్ఏ గపూర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నూతన పాలకవర్గ సభ్యులు కృషి చేయాలి.

**ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభరాజా.**



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 29:**ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నూతన పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు.నూతనముగా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రత్తిపాడు మండలం, లంపకలోవ , చినశంకర్లపూడి, రౌతుపాలెం పాఠశాల నూతన అభివృద్ధి కమిటీ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే సత్యప్రభరాజాను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా పూలమాలలతో సత్కరించి, అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభరాజా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ద్రుష్టి సారిస్తుందని,పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు విద్యార్థుల సంఖ్య పెంచేందుకు, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పాలకవర్గ సభ్యులకు సూచించారు.

## కాలు కోల్పోయిన వృద్ధుడికి మంత్రి సుభాష్ అండ

- రూ.15 వేల ఆర్థిక సాయం అందించి భరోసా



**రామచంద్రపురం పెన్ పవర్, సెప్టెంబర్ 29 :** షుగర్ వ్యాధి తీవ్రతతో కాలు కోల్పోయిన వేగాయమ్మపేట (పెయ్యలవారిపేట) గ్రామానికి చెందిన పెయ్యల ముత్యాలును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఉండాలని వృద్ధుడికి భరోసా కల్పించారు. అవసరమైన సమయంలో తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యతని మంత్రి పేర్కొన్నారు. పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ద్వారా సమాజంలో మానవత్వం మరింత బలపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, బొమ్ము బాలకృష్ణ , కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో వీఆర్ఏలు వంటావార్పుతో వినూత్న నిరసన.

- 14 వ రోజుకు చేరుకున్న వీఆర్ఏ నిరవధిక దీక్ష.



**పెన్ పవర్, సెప్టెంబర్ 29 :**తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ వీఆర్ఏల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ప్రత్తిపాడు వి.ఆర్.ఏ లు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం 14:వ రోజుకు చేరుకుంది. దీంతో పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత 14 రోజులుగా తహసిల్దార్ కార్యాలయం వద్ద తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ అమలు చేయాలని సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చిరు ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా పే స్కేలు ఇవ్వడంతో పాటు, తమ న్యాయమైన కోరికలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.14 వ రోజు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేసి వినూత్న నిరసన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కొమరగిరి కృష్ణ, మానూరి సత్తిబాబు, మురా గంగరాజు,చానపల్లి తాతారావు,పలివెల అనిల్ కుమార్,అభి,దేవరాజు మండలంలోని పలువురు వి ఆర్ ఏ లు పాల్గొన్నారు.

## విద్యార్థుల అస్వస్థతపై ఎస్సై సురేష్ వేగవంతమైన స్పందన

- ఏకలవ్య విద్యార్థులకు శ్వాసకోశ ఇబ్బందులు
- మెరుగైన వైద్యం కోసం చింతపల్లికి తరలింపు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** గూడెంకొత్తవీధి మండలంలోని ఏకలవ్య పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం అందడంతో జీకేవీధి ఎస్ఐ కె. సురేష్ వెంటనే స్పందించారు.విషయం తెలిసిన వెంటనే ఆసుపత్రికి చేరుకున్న ఎస్ఐ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అత్యవసర వైద్య సహాయం అవసరమని గుర్తించి, మెరుగైన చికిత్స కోసం విద్యార్థులను జీకేవీధి నుంచి చింతపల్లి ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు సకాలంలో వైద్యం అందేలా సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకున్నారు.విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్న సమయంలో ఎస్ఐ సురేష్ వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టడంపై తల్లిదండ్రులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

## ఎస్. ఎం. సి ఎన్నికలు ప్రశాంతం హైస్కూల్ చైర్మన్ గా విళ్ళ లోవరాజు

**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 29:**మండలంలో ఉన్న 9 హైస్కూళ్లు, 55 ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన ఎస్. ఎం. సి ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. అంబాజీపేట హైస్కూల్ చైర్మన్ గా విళ్ళ లోవరాజు, వైస్ ఛైర్మన్ గా కుసుమ సత్యవేణి, తొండవరం హైస్కూల్ కమిటీ ఛైర్మన్ గా కాండ్రేగుల ప్రసాద రావు, వైస్ ఛైర్మన్ గా ముత్తాబత్తుల సరస్వతి, కె. పెదపూడి హైస్కూల్ కమిటీ ఛైర్మన్ గా నము దూరి మంగాదేవి, వైస్ ఛైర్మన్ గా నార్గాన స్వామి, గంగలకుర్రు అగ్రహారం హైస్కూల్ కమిటీ ఛైర్మన్ గా మట్టపర్తి విజయకుమార్, వైస్ ఛైర్మన్ గా పులిడింది సత్య వేణి, గంగలకుర్రు హైస్కూల్ కమిటీ ఛైర్మన్ గా కమిడీ దుర్గాదేవి, వైస్ ఛైర్మన్ గా వాసంశెట్టి సత్యనారాయణ, ఇసుక పూడి హైస్కూల్ కమిటీ ఛైర్మన్ గా పళ్ళ స్వామి నాయుడు, వైస్ ఛైర్మన్ గా గూటం ఆదిలక్ష్మి, ముక్కామల హైస్కూల్ కమిటీ ఛైర్మన్ గా ఖండవల్లి విజయ కృష్ణ, వైస్ ఛైర్మన్ గా, మానేపల్లి రాణి, చిరత పూడి హైస్కూల్ కమిటీ ఛైర్మన్ గా కాటంరెడ్డి ఆదినారాయణ, వైస్ ఛైర్మన్ గా సిద్దిల చిట్టితల్లి, పుల్లేటికుర్రు హైస్కూల్ కమిటీ ఛైర్మన్ గా అందే పల్లపు రాజు, వైస్ ఛైర్మన్ గా చిట్టూరి రాధా బాయ్ లు ఎన్నికయ్యారని కొత్తపేట డిప్యూటీ విద్యాశాఖధికారి కాండ్రేగుల వెంకటేశ్వర రావు, ఎం. ఈ. ఓ మోకా ప్రకాష్ లు తెలిపారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com